ఘనంగా ఛట్ పూజలు

● వేడుకలో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

చంపాపేట, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్‌లోని హనుమాన్ ఆలయంలో గురువారం ఉత్తర భారత్ నాగరిక్ సంఘ్ ఆధ్వర్యంలో సూర్యాస్తమయ సమయంలో కోనేరులో ఛట్ పూజలను ఘనంగా జరుపుకున్నారు. ఉత్తర భారత్ నాగరిక్ సంఘ్ వనస్థలిపురం శాఖ చైర్మన్ ఎన్‌కే సింగ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి హాజరై కోనేరులో పూజలు చేశారు. ఎమ్మెల్యేను వారు ఘనంగా సన్మానించారు. ఉత్తరభారత్ నాగరిక్ సంఘ్ ప్రజలకు ఎమ్మెల్యే ఛట్ పూజ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. మహిళలు కోనేరులో దీపాలు వెలిగించి పండ్లు, చెరుకు గడలను సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ మాజీ చైర్మన్ ఈశ్వరమ్మయాదవ్, సంఘ్ డైరెక్టర్ అమర్‌జిత్‌సింగ్, నందకిషోర్‌సింగ్, గోవింద్ రిధి, శ్రవణ్‌కుమార్, ఆలయ మాజీ డైరెక్టర్ మధుసాగర్ పాల్గొన్నారు.

నాగోలు కోనేరులో..

మన్సూరాబాద్ : నాగోలు కోనేరులో గురువారం రాత్రి నిర్వహించిన ఛట్ పూజల్లో స్థానిక కార్పొరేటర్ అరుణాసురేందర్‌యాదవ్‌తో కలిసి ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ అరుణ ఛట్‌తో కోనేరు వద్ద బీహారీలతో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ నేపాల్ దేశంలోని పలు ప్రాంతాలతో పాటు దేశంలోని ఉత్తర ప్రదేశ్, బీహార్ రాష్ట్రాలలో ప్రతి ఏటా కార్తీక మాసం 6వ రోజు నుంచి ప్రారంభమయ్యే ఛట్ పూజలు చేస్తుంటారని, ఈ పూజలో భాగంగా తమ కుటుంబం సుఖసంతోషాలతో ఉండాలని కోరుతూ సూర్య భగవానుడిని ఆరాధిస్తారన్నారు. అనంతరం విచ్చేసిన అతిథులను బీహారీ అసోసియేషన్ సభ్యులు శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతల సురేంద్రనాథ్‌యాదవ్, బీహారీ మహిళలు పెద్దఎత్తున పాల్గొన్నారు.



ఛట్ పూజల్లో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, సంఘ్ చైర్మన్ ఎన్‌కే సింగ్



ఛట్ పూజ కార్యక్రమంలో రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, ఎన్.కె.సింగ్

ప్రజలు సుఖసంతోషాలతో జీవించాలి : మల్‌రెడ్డి రాంరెడ్డి

వనస్థలిపురం : ప్రజలందరు సుఖసంతోషాలతో జీవించాలని భగవంతుడిని కోరుకున్నట్లు తెలంగాణ రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి అన్నారు. హయత్‌నగర్ డివిజన్ శారదానగర్‌కాలనీలో ఉత్తర్‌భారత్ నాగరిక్ సంఘ్ చైర్మన్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఎస్.కె సింగ్ ఆధ్వర్యంలో ఛట్ పూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మల్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్ రెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ జైపాల్‌రెడ్డి, దీపావళి శ్రవణ్ కుమార్, జర్నలిస్ట్ దేవ్‌కుమార్, కాంగ్రెస్ నాయకులు రవికుమార్, నందకిషోర్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి నష్ట పరిహారం ఇవ్వాలి

హయత్‌నగర్ : హయత్‌నగర్ ప్రభుత్వ పాఠశాల గేటు మీద పడి ఇటీవల మృతి చెందిన విద్యార్థి అజయ్ తల్లిదండ్రులు గురువారం ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జిల్లా విద్యాధికారికి ఫోన్ చేసి సత్వరమే బాధిత కుటుంబానికి నష్ట పరిహారం అందించాలని కోరారు. ఆయన మాట్లాడుతూ అధికారులు ప్రకటించిన ఎక్స్‌గ్రేషియా, ఇల్లు, స్కావెంజర్ ఉద్యోగం మంజూరు చేయాలని కోరారు. హయత్‌నగర్ డివిజన్ అధ్యక్షుడు శ్రీధర్‌గౌడ్, లక్ష్మన్, ఇంద్రకరణ్‌రెడ్డి, రాజు, బాధితుడి తల్లి సరోజ, తండ్రి చందు పాల్గొన్నారు.

హుడా ఆడిటోరియాన్ని మినీ రవీంద్రభారతిగా నిర్మించాలి

● సీఎంకు వినతిపత్రం అందజేసిన కార్పొరేటర్ వెంకటేశ్వర్‌రెడ్డి

వనస్థలిపురం : వనస్థలిపురంలోని హుడా ఆడిటోరియాన్ని మినీ రవీంద్రభారతిగా నిర్మించాలని కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు. గురువారం సీఎం రేవంత్‌రెడ్డికి ఆయన నివాసంలో కార్పొరేటర్ వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా హామీలకే పరిమితమైన హుడా ఓపెన్ ఆడిటోరియంలో మినీ రవీంద్రభారతిని నిర్మించాలని సీఎంను కోరామన్నారు. తమ సమస్యల పట్ల తక్షణమే స్పందించిన సీఎం కార్పొరేటర్ ఇచ్చిన వినతిపత్రాన్ని సంబంధిత అధికారులకు అందజేసి అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని ఆదేశించినట్లు కార్పొరేటర్ పేర్కొన్నారు.



వినతిపత్రం ఇస్తున్న కార్పొరేటర్ వెంకటేశ్వర్‌రెడ్డి

మహిళ అదృశ్యం



సునీత

హయత్‌నగర్ : భర్త కర్రీ పాయింట్‌కు వెళ్లి కూర తెచ్చుకునే లోపు భార్య ఇంట్లో చెప్పకుండా బయటకు వెళ్లిన సంఘటన హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. వివరాల ప్రకారం.. పసులది ప్రసాద్‌రావు, ఆయన భార్య పసులది సునీత(57) భాగ్యలత బీడీఎల్ కాలనీలో నివాసం ఉంటున్నారు. బుధవారం మధ్యాహ్నం ప్రసాద్‌రావు భాగ్యలత కాలనీలో కర్రీ తెచ్చుకోవడానికి కర్రీ పాయింట్‌కు వెళ్లాడు. పది నిముషాల తర్వాత ఇంటికి రాగా భార్య సునీత కనిపించలేదు. దీంతో ప్రసాదరావు తెలిసిన వారి వద్ద, కుటుంబ సభ్యుల వద్ద విచారించినా ఆచూకీ లభించలేదు. గురువారం ప్రసాదరావు తన భార్య కనిపించడం లేదని హయత్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తులో ఉంది.

కళాశాల మెస్ ఇన్‌చార్జి అదృశ్యం

హయత్‌నగర్ : కుంట్లూర్ నారాయణ కళాశాల మెస్ ఇన్‌చార్జి అదృశ్యమైన సంఘటన హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కుంట్లూర్ తెలంగాణ నగర్ కాలనీలో నివాసం ఉండే దేవిరెడ్డి నాగేశ్వర్‌రెడ్డి(55) కుంట్లూర్ నారాయణ కళాశాల మెస్ ఇన్‌చార్జిగా పని చేస్తున్నాడు. ఈనెల 2వ తేదీన రాత్రి 8.30 గంటలకు రోజు మాదిరిగానే డ్యూటీకి వెళ్తున్నానని చెప్పి వెళ్లాడు. తిరిగి ఇంటికి రాలేదు. దీంతో చుట్టు పక్కల వెతికినా ఫలితం లేకపోవడంతో గురువారం సాయంత్రం నాగేశ్వర్‌రెడ్డి కుమారుడు రాంరెడ్డి హయత్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

వనస్థలిపురం : కాలనీల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని బీఎన్‌రెడ్డినగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలోని ఎస్బీవీఎస్ కాలనీలోని రోడ్ల నిర్మాణం కోసం రూ.78లక్షలను మంజూరు చేసిన సందర్భంగా కాలనీవాసులు కార్పొరేటర్‌ని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కాలనీవాసులు పాల్గొన్నారు.

డివిజన్ అభివృద్ధే లక్ష్యం

చంపాపేట : డివిజన్‌లోని ఆయా కాలనీలు, బస్తీలను అన్ని విధాలుగా అభివృద్ధి చేయడమే తన లక్ష్యం అని కార్పొరేటర్ వంగా మధుసూదన్‌రెడ్డి అన్నారు. చంపాపేట డివిజన్‌లోని యాదగిరినగర్‌కాలనీ, న్యూపద్మానగర్‌కాలనీలలో జీహెచ్‌ఎంసీ నిధులు రూ.55లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను గురువారం కార్పొరేటర్ పరిశీలించారు. కార్యక్రమంలో పద్మానగర్‌కాలనీ అధ్యక్షుడు జయవర్ధన్‌రెడ్డి, ఆయా కాలనీల ప్రతినిధులు ముత్యాల వీరారెడ్డి, శ్రీనివాసరావు, శ్రవణ్‌కుమార్‌రెడ్డి, ఆంజనేయులు, నాయకులు పాల్గొన్నారు.

సీజ్ చేసిన ఇంటి తాళం ధ్వంసం

హయత్‌నగర్ : ఫైనాన్స్ కంపెనీ సీజ్ చేసిన ఇంటి తాళాలను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. ఇంట్లో దొంగతనం జరిగిందా..? లేక మరెవరైన ఉద్దేశపూర్వకంగా తీశారా అనే అనుమానాలు కలుగుతున్నాయి. హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన ఈ సంఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. మన్సూరాబాద్ డివిజన్ హయత్‌నగర్ విజయనగర్ కాలనీలో నివాసం ఉండే బి. శ్రీశైలం ముత్తూట్ ఫైనాన్స్ వద్ద లోన్ తీసుకున్నాడు. లోన్ అమౌంట్ చెల్లించకపోవడంతో గత సోమవారం ఫైనాన్స్ కంపెనీ వారు ఇంటిని సీజ్ చేశారు. శ్రీశైలం భార్య, కుటుంబ సభ్యులను ఇంట్లో నుంచి బయటకు పంపించి ఇంటిని సీజ్ చేశారు. శ్రీశైలంకు చెందిన ఇంటి సామగ్రి, నగలు, నగదు, దుస్తులు ఇంట్లోనే ఉన్నాయి. ఇదిలా ఉండగా గురువారం సీజ్ చేసిన ఇంటి తాళాలు తీసి ఉన్నాయి. దీంతో శ్రీశైలం తన ఇంట్లోని వస్తువులను, నగలు, నగదును ఫైనాన్స్ కంపెనీ వారు కాజేసి తనపై రుద్దుతున్నారని శ్రీశైలం హయత్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీజ్ చేసిన ఇంటి తాళాలు ఎవరు తీశారనేది ప్రశ్నార్థకంగా మారింది. ఈ విషయంపై హయత్‌నగర్ పోలీసులను ప్రశ్నించగా ఫైనాన్స్ కంపెనీ నుంచి తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని అన్నారు. శ్రీశైలం ఫిర్యాదుపై స్పందిస్తూ ఇంటిని పంచనామా చేసి సీజ్ చేసిన తర్వాత ఇల్లు ఫైనాన్స్ వారికే చెందుతుందన్నారు. ఫైనాన్స్ నుంచి ఫిర్యాదు అందగానే క్లూస్ టీంలను రప్పించి వాస్తవాలు తేలుస్తామని ఎస్‌ఐ వెంకట్‌రెడ్డి తెలిపారు.

అత్తపై అల్లుడి అత్యాచారం

● కేసు నమోదు

పహాడీషరీఫ్, నవంబర్ 7(ఆంధ్రజ్యోతి): మత్తుమందు ఇచ్చి అత్తపై అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ మేరకు అల్లుడిపై పోలీసులు కేసు నమోదు చేశారు. బాలాపూర్ ఇన్‌స్పెక్టర్ సుధాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తపేటకు చెందిన షాకీర్‌కు నాలుగేళ్ల క్రితం వివాహమైంది. కాగా, ప్రస్తుతం వారికి ముగ్గురు సంతానం. ఈనెల 4న మధ్యాహ్నం షాకీర్ అత్తారింటికి రాగా ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేరు. ఇదే అదునుగా భావించి తనతో తెచ్చుకున్న మత్తుమందును కూల్‌డ్రింక్‌లో కలిపి అత్తకు ఇచ్చాడు. కాసేటి తర్వాత ఆమె స్పృహ కోల్పోగా ఆమెపై అత్యాచారంచేసి పరారయ్యాడు. ఈ విషయం బయటకు చెబితే తల్లీ కుమార్తెలను చంపేస్తానని ఫోన్ ద్వారా అత్తను బెదిరించాడు. గురువారం బాధిత మహిళ పోలీసులకు ఫిర్యాదు చేసింది. నిందితుడు షాకీర్‌పై అత్యాచారం, భయపెట్టడం, దాడి చేసిన, సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బలహీనవర్గాల అభ్యున్నతికి ప్రణాళికలు రూపొందించడానికే సర్వే

● యువజన కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు చిలుక ఉపేందర్‌రెడ్డి

ఎల్‌బీనగర్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో బలహీనవర్గాల అభ్యున్నతికి ప్రణాళికలు రూపొందించి అమలు చేయడానికే రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే చేపడుతున్నదని యువజన కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు చిలుక ఉపేందర్‌రెడ్డి చెప్పారు. సర్వేలో భాగంగా గురువారం ఆర్‌కేపురం డివిజన్‌లోని వాసవీకాలనీలో హౌస్ లిస్టింగ్ ప్రక్రియను సరూర్‌నగర్ ఉపకమిషనర్ సుజాత పర్యవేక్షణలో ఎన్యూమరేటర్లు చేపట్టారు. ఈ ప్రక్రియలో పాల్గొన్న ఉపేందర్‌రెడ్డి మాట్లాడుతూ బీసీ లు, ఎస్సీలు, ఎస్టీలతో పాటు ఇతర బలహీనవర్గాల అభ్యున్నతి, సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ అవకాశాలను మెరుగుపర్చేందుకు ఈ సర్వే దోహదపడుతుందన్నారు. ఈ సర్వే దేశానికే ఆదర్శమన్నారు. ప్రతి ఒక్కరూ ఈ సర్వేలో భాగస్వాములు కావాలన్నారు. ఎన్యూమరేటర్లకు వివరాలు అందించి సహకరించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు లింగస్వామిగౌడ్ ఇతర జీహెచ్‌ఎంసీ సిబ్బంది పాల్గొన్నారు.



సమగ్ర ఇంటింటి సర్వేలో చిలుక ఉపేందర్‌రెడ్డి



పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ 5వ వార్డులో ఇంటికి స్టిక్కర్‌ను అతికిస్తున్న సిబ్బంది, పక్కన కమిషనర్ రవీందర్‌రెడ్డి

పెద్దఅంబర్‌పేట్‌లో 17వేల ఇళ్లకు స్టిక్కరింగ్

అబ్దుల్లాపూర్‌మెట్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ పరిధిలోని వార్డులో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే ప్రక్రియ వేగంగా సాగుతుంది. రెండు రోజుల్లో మొత్తం 17వేల కుటుంబాల ఇళ్లకు ఎన్యుమరేటర్లు స్టిక్కరింగ్ అతికించారు. మున్సిపాలిటీ పరిధిలోని 24 వార్డులతో పాటు ఇటీవల విలీనమైన 4గ్రామాలతో కలిసి మొత్తం 26వేల కుటుంబాలు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఇంకా మరో 9వేల ఇళ్లకు హౌస్ స్టిక్కరింగ్ చేయాల్సి ఉన్నది. శుక్రవారం కూడా అవకాశం ఉండడంతో ఇళ్ల స్టిక్కరింగ్ పూర్తి చేస్తామని కమిషనర్ రవీందర్‌రెడ్డి తెలిపారు. 9వ తేదీ నుంచి స్టిక్కరింగ్ చేసిన ప్రతి కుటుంబం యొక్క పూర్తి వివరాలను సర్వేఫారంలో నమోదు చేస్తామని ఆయన తెలిపారు.

రోడ్డు వెడల్పు చేపట్టండి

● జీహెచ్‌ఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కొప్పుల నర్సింహారెడ్డి



డివిజన్‌లో నెలకొన్న సమస్యలను జెడ్సీకి వివరిస్తున్న కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి

మన్సూరాబాద్ : రోజు రోజుకు పెరుగుతున్న ట్రాఫిక్ దృష్ట్యా కామినేని చౌరస్తా నుంచి సుష్మాచౌరస్తా వరకు రోడ్డు విస్తరణ పనులను వెంటనే చేపట్టాలని మన్సూరాబాద్ కార్పొరేటర్, జీహెచ్‌ఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కొప్పుల నర్సింహారెడ్డి అధికారులను కోరారు. మార్నింగ్‌వాక్‌లో భాగంగా కార్పొరేటర్ విజ్ఞప్తి మేరకు ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్, డిప్యూటీ కమిషనర్ తిప్పర్తి యాదయ్యలు డివిజన్ పరిధిలోని వివేకానందనగర్‌కాలనీ, సహారా రోడ్డు మార్గంలో పర్యటించి చేపట్టాల్సిన అభివృద్ధి, నెలకొన్న సమస్యలను గురించి కొప్పుల నర్సింహారెడ్డిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ రోడ్డు వెడల్పు లేనందున బిగ్‌బజార్ నుంచి సుష్మాచౌరస్తా వరకు తీవ్రంగా ట్రాఫిక్ సమస్య నెలకొంటుందన్నారు. అదేవిధంగా రోజురోజుకు కాలనీల సంఖ్య, జనాలు పెరుగుతున్నందున కాలనీల్లో వ్యర్థాలు పేరుకుపోతున్నాయని, శానిటేషన్ సిబ్బంది సంఖ్యను పెంచాలని కోరారు. ఇందుకు జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్ సానుకూలంగా స్పందించినట్లు కార్పొరేటర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో వివేకానందనగర్ కాలనీ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

సర్కిల్ 6 ఇన్‌చార్జి డీసీగా సంజయ్‌సింగ్

ఓల్డ్‌మలక్‌పేట, నవంబరు 7(ఆంధ్రజ్యోతి) : మలక్‌పేట సర్కిల్ 6 డిప్యూటీ కమిషనర్ జయంత్ సెలవుపై వెళ్లారు. ఆయన స్థానంలో ఇన్‌చార్జి కమిషనరుగా సంజయ్‌సింగ్ గురువారం నుంచి బాధ్యతలు నిర్వహిస్తున్నారు. జయంత్ విధుల్లో చేరే వరకు ఇన్‌చార్జి పర్యవేక్షనలో ఉంటుందని సంబంధిత సర్కిల్ అధికారులు తెలిపారు.

భరించలేకపోతున్నాం.. సెలవులు ఇవ్వండి

● బోయగూడ నర్సింగ్ హాస్టల్‌లో డ్రైనేజీ కంపు
● గాంధీ ఆస్పత్రిలో నర్సింగ్ విద్యార్థినుల ఆందోళన
● డ్రైనేజీ పైప్‌లైన్‌లు పగిలి నెలరోజుల నుంచి ఇదే పరిస్థితి
● పలుమార్లు ఫిర్యాదులు చేసినా ఫలితం శూన్యం
● గాంధీలో 8వ అంతస్తులో నర్సులకు వసతి ఏర్పాట్లు



గాంధీ సూపరింటెండెంట్ రాజకుమారికి సమస్యలు చెప్పుకుంటున్న నర్సింగ్ విద్యార్థినులు

అడ్డగుట్ట, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): డ్రైనేజీ పైపులైన్ పగిలిపోయి వస్తున్న దుర్గంధంతో బోయగూడ నర్సింగ్ హాస్టల్‌లో ఉండలేకపోతున్నామని నర్సింగ్ విద్యార్థినులు గురువారం గాంధీ ఆస్పత్రిని చుట్టుముట్టారు. పరీక్షలు దగ్గరికి వస్తున్నాయని, దుర్వాసన కారణంగా సరిగ్గా చదువుకోలేక పోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. సెలవులు ఇవ్వాలని వారు కోరారు. గాంధీ ఆస్పత్రిలో విధులు నిర్వహిస్తున్న 130 మంది నర్సింగ్ విద్యార్థినులు సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ వెనుక వైపు ఉన్న బోయగూడలోని హాస్టల్ ఉంటున్నారు. ఆరునెలల నుంచి హాస్టల్‌లో పరిస్థితి దయనీయంగా మారడంతో గాంధీ ఆస్పత్రిని చుట్టుముట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నెల రోజుల నుంచి డ్రైనేజీ దుర్గంధ సమస్య ఉందని, వాసన కారణంగా సరిగ్గా తినలేకపోతున్నామని తెలిపారు. దీనిపై పలుమార్లు గాంధీ సూపరింటెండెంట్ రాజకుమారి, నర్సింగ్ సూపరింటెండెంట్‌లతో పాటు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని నర్సులు చెప్పారు. చివరికి హాస్టల్ నుంచి 2 కి.మీల దూరం నడుచుకుంటూ వచ్చి ఆస్పత్రిని చుట్టుముట్టామని, తమ సమస్యను పరిష్కరించి న్యాయం చేసేవరకు ఇక్కడే ఉంటామని స్పష్టం చేశారు. దీంతో దాదాపు మూడు గంటల పాటు ఆస్పత్రి ప్రాంగణంలో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. బోయగూడ హాస్టల్ బాలేకపోతే గాంధీ ఆస్పత్రిలోని 8వ అంతస్తులో నర్సులు ఉండవచ్చని సూపరింటెండెంట్ రాజకుమారి, ఆర్‌ఎంఓ 1, నర్సింగ్ కాలేజీ వైస్ ప్రిన్సిపాల్‌కు చెప్పారు. అయితే ఆ గదులు దుమ్ముతో నిండి ఉన్నాయని, ఈ విషయాన్ని ప్రత్యక్షంగా చూపిస్తామని నర్సులు లిఫ్టు ద్వారా 8వ అంతస్తుకు వెళ్లేందుకు ప్రయత్నించారు. అయితే, లిఫ్టు ఎక్కకుండా జీడీఎక్స్ సెక్యూరిటీ గార్డులు అడ్డుకుని, ఆడ పిల్లలు అని చూడకుండా బయటికి ఈడ్చుకొచ్చారని, ఆగ్రహం వ్యక్తం చేశారు. జీడీఎక్స్ సెక్యూరిటీ కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాగా, నర్సుల గొడవ చేయడంతో గాంధీలోని 8వ అంతస్తును శుభ్రం చేయించారు.

పరీక్షలకు వారం ముందే సెలవులిస్తాం: సూపరింటెండెంట్

గాంధీలో విధులు నిర్వహిస్తున్న నర్సులకు ఈనెల 28 నుంచి పరీక్షలు ఉన్నాయని, నిబంధనల ప్రకారం పరీక్షలకు వారం రోజుల ముందు మాత్రమే సెలవులు ఇస్తామని, అంతకంటే ఎక్కువ రోజులు సెలవులు ఇచ్చేది లేదని సూపరింటెండెంట్ స్పష్టం చేశారు. నర్సులు ఇంటికి వెళ్లాలనే ఉద్దేశంతోనే రాద్ధాంతం చేస్తున్నారని అన్నారు. బోయగూడ నర్సింగ్ హాస్టల్‌ను బాగు చేయడానికి కొద్ది రోజుల క్రితం రూ.40 లక్షల నిధులు మంజూరు అయ్యాయని త్వరలో హాస్టల్ మరమ్మతులు చేయిస్తామని చెప్పారు.

సీబీఐ అధికారినని బెదిరించి.. ప్రభుత్వ ఉద్యోగి నుంచి రూ.48 లక్షలు స్వాహా

హైదరాబాద్ సిటీ, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): తాను సీబీఐ అధికారినని, మీ బ్యాంకు ఖాతాల్లో అక్రమ లావాదేవీలు జరిగాయంటూ సైబర్ నేరగాళ్లు ఓ ప్రభుత్వ ఉద్యోగిని బోల్తా కొట్టించారు. తాము చెప్పినట్లు వినకుంటే అరెస్టు తప్పదంటూ బెదిరించి రూ.48 లక్షలను తమ ఖాతాల్లోకి బదిలీ చేయించుకున్నారు. వివరాలిలా ఉన్నాయి.. నగరానికి చెందిన ఓ ప్రభుత్వ ఉద్యోగి (55)కి సైబర్ నేరగాడు ఫోన్ చేశాడు. 'తాను సీబీఐ అధికారిని. మీ పేరుతో ఢిల్లీ బ్యాంక్ ఆఫ్ బరోడా శాఖలో రూ.20 కోట్ల నుంచి రూ.30 కోట్ల వరకు అక్రమ లావాదేవీలు జరిగాయి. దీనిపై మనీలాండరింగ్ కేసులు నమోదయ్యాయి. అరెస్టు తప్పదు. మనీలాండరింగ్ కేసు నమోదైతే ఉద్యోగం పోవడంతోపాటు కుటుంబసభ్యులకూ ఇబ్బందులు వస్తాయి. మీ ఇంటి చుట్టూ సివిల్ దుస్తుల్లో సీబీఐ అధికారులు ఉన్నారు. మేం చెబితే ఏ క్షణంలోనైనా అరెస్ట్ చేస్తారని' బెదిరించాడు. అదే ఫోన్‌కాల్‌లో ఈడీ అధికారి అంటూ మహిళ రంగప్రవేశం చేసి సదరు ఉద్యోగిని గందరగోళానికి గురిచేయడంతో పాటు ఆదాయం, బ్యాంకు ఖాతాలు, అందులో ఉన్న నగదు వివరాలు సేకరించింది. గంటగంటకు వీడియోకాల్ చేసి, తమతో కాంటాక్ట్‌లో ఉండాలని సూచించింది. మీ బ్యాంకు ఖాతాల్లో ఉన్న డబ్బును ఆర్‌బీఐ ఖాతాకు పంపి మీ నిర్దోషిత్వాన్ని నిరూపించుకోవాలని, సుప్రీంకోర్టులో విచారణ తర్వాత మీ డబ్బు తిరిగి పంపుతామని సైబర్ నేరగాళ్లు చెప్పారు. ఇదంతా నిజమేనని నమ్మిన ఆ ఉద్యోగి.. వారు సూచించిన ఖాతాల్లోకి రూ.48 లక్షలు ఆర్‌టీజీఎస్ ద్వారా పంపారు. తర్వాత వారి ఫోన్లు పని చేయకపోవడంతో మోసపోయానని గ్రహించి సైబర్ క్రైం ఠాణాలో ఫిర్యాదు చేశారు.



ఘనంగా ఛట్ పూజలు

ఖైరతాబాద్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): నగరంలోని హుస్సేన్‌సాగర్ గంగమ్మ దేవాలయం, బతుకమ్మ ఘాట్ వద్ద ఉత్తర ప్రాంతీయులు జరుపుకునే ఛట్ పూజలు వైభవంగా జరిగాయి. ఈ మేరకు గురువారం సాయంత్రం నుంచి రాత్రి వరకు సంప్రదాయబద్ధంగా జరిగిన పూజల్లో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఛత్ పూజల సందర్భంగా హెచ్‌ఎండీఏ ప్రత్యేక ఏర్పాట్లతో పాటు సాగర్‌లో బోట్లతో సెక్యూరిటీ సిబ్బందితో చర్యలు చేపట్టారు.

బ్యాంక్ మేనేజర్ చేతివాటం

4.80 కోట్లకు టోకరా

(5వ పేజీ తరువాయి)

మోసం జరిగినట్లు గుర్తించి కేసును ఆర్థిక నేరాల విభాగానికి బదిలీ చేశారు. ఈ కేసును పూర్తిగా దర్యాప్తు చేసిన ఈవోడబ్ల్యూ అధికారులు బ్యాంకు మేనేజర్‌తోపాటు మరికొందరు కలిసి ముఠాగా ఏర్పడి భారీస్థాయిలో మోసం చేసినట్లు గుర్తించారు. నకిలీ ధ్రువపత్రాలతో రుణం తీసుకున్న వారితోపాటు నకిలీపత్రాలు సమకూర్చిన వారిని అరెస్ట్ చేశారు. వీరంతా బ్యాంకు మేనేజర్ కార్తీక్‌రాయ్‌తో కలిసి మోసానికి పాల్పడ్డారని, నకిలీపత్రాలతో రుణాన్ని మంజూరు చేసినందుకు బ్యాంకు మేనేజర్ 5 శాతం కమీషన్ తీసుకునేవాడని దర్యాప్తులో తేలింది. తెలంగాణ రెసిడెన్షియల్ స్కూల్ ఉద్యోగుల పేరుతో నకిలీపత్రాలు, పేస్లిప్పులతో మట్టేపల్లి శ్రీకాంత్ రూ.15 లక్షలు, పోలె విశాల్ మరో రూ.15 లక్షల చొప్పున రుణం తీసుకున్నారు. వీరికి నకిలీపత్రాలు సమకూర్చడంలో దాగల రాజు, శుధాంశు శేఖర్ పరిదా, ఎండీ వాజిద్, సునీల్‌కుమార్, భాస్కర్‌గౌడ్, ఆమంచి ఉపేందర్ సహకరించారని గుర్తించారు. వీరంతా 2022 నుంచి 2023 వరకు రూ.4.80 కోట్లు కాజేసినట్లు పోలీసు అధికారులు తెలిపారు.

చనిపోయిన వారి ఖాతాల్లో డబ్బు కూడా..

కార్తీక్‌రాయ్ తన అధికారాన్ని దుర్వినియోగం చేసి పలుమార్గాల్లో డబ్బు కాజేశాడు. బ్యాంకు ఖాతాదారులకు తెలియకుండా వారి లోన్‌పై టాప్ అప్ తీసుకొని, ఇతర ఖాతాలకు మళ్లించాడు. ఖాతాదారుల ఫిక్స్‌డ్ డిపాజిట్ల సొమ్మును వేరే ఖాతాలకు బదిలీ చేశాడు. బ్యాంకు ఖాతాదారులు ఎవరైనా చనిపోతే వారి కుటుంబసభ్యులకు తెలియకుండా ఖాతాలో డబ్బు కాజేసేవాడు. బ్యాంకుకు వచ్చిన ఖాతాదారులకు మ్యూచువల్‌ఫండ్స్‌లో పెట్టుబడి పెడితే పెద్దమొత్తాల్లో లాభాలు వస్తాయని నమ్మించి పెట్టుబడి పేరుతో డబ్బులు వసూలు చేసి సొంత ఖాతాలో జమ చేసుకున్నట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది.

స్పెషల్ డ్రైవ్‌లో.. 50 వేల మ్యాన్‌హోల్స్ శుభ్రం

● 700 కిలోమీటర్ల పైపులైన్‌కు డీ-సిల్టింగ్

హైదరాబాద్ సిటీ, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): సివరేజ్ ఓవర్ ఫ్లో ఫ్రీ సిటీ హైదరాబాద్ లక్ష్యంగా వాటర్‌బోర్డు చేపట్టిన 90 రోజుల స్పెషల్ డ్రైవ్‌లో గురువారం వరకు 50 వేల మ్యాన్ హోల్స్ శుభ్రం చేశారు. దీంతో పాటు 6,140 ప్రాంతాల్లో 700 కిలో మీటర్ల మేర సివరేజ్ పైపులైన్‌ను డీ-సిల్టింగ్ పనులు నిర్వహించారు. గాంధీ జయంతి సందర్భంగా ప్రారంభమైన ఈ స్పెషల్ డ్రైవ్‌లో మొదట అధికంగా ఫిర్యాదులు వచ్చే ప్రాంతాలను ఎంపిక చేసుకొని మ్యాన్ హోల్స్, సివరేజ్ లైన్లను శుభ్రం చేస్తున్నారు. ఇందులో ఎయిర్‌టెక్, మినీ ఎయిర్‌టెక్ మిషన్లు కీలకంగా వ్యవహరిస్తున్నాయి. రోజువారీగా వాటర్‌బోర్డుకు వచ్చే ఫిర్యాదులను పరిష్కారం చేయడంతో పాటు స్పెషల్ డ్రైవ్ నిర్వహించేలా బాధ్యతలను అప్పగించారు. ఈ ప్రక్రియ విజయవంతంగా సాగుతుండడంతో 90 రోజుల స్పెషల్ డ్రైవ్ తర్వాత కూడా కొనసాగించేందుకు వాటర్‌బోర్డు చర్యలు చేపడుతోంది. స్పెషల్ డ్రైవ్‌లో 50వేల మ్యాన్‌హోల్స్‌ను శుభ్రం చేయడం పట్ల అధికారులు, సిబ్బందిని వాటర్‌బోర్డు ఎండీ అశోక్‌రెడ్డి అభినందించారు. ఇదే స్ఫూర్తి రాబోయే రోజుల్లోనూ కొనసాగించాలని సూచించారు.

లంచగొండి అధికారికి ఏడాది జైలు

● రూ. 20 వేల జరిమానా విధించిన ఏసీబీ కోర్టు

హైదరాబాద్ సిటీ, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ప్లాట్ మ్యుటేషన్ చేసేందుకు రూ.20 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డ జీహెచ్‌ఎంసీ ఉద్యోగికి ఏడాది జైలు శిక్ష విధిస్తూ ఏసీబీ కోర్టు తీర్పు వెలువరించింది. జీహెచ్‌ఎంసీ రాజేంద్రనగర్ సర్కిల్ 6 కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న జిలగం వెంకటేశ్వరరావు, 2013లో ఓ ప్లాట్‌కు సంబంధించి మ్యుటేషన్ చేసేందుకు బాధితుడి వద్ద రూ.20 వేలు లంచం డిమాండ్ చేశాడు. బాధితుడు ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేయడంతో వలపన్నిన ఏసీబీ అధికారులు వెంకటేశ్వరరావు రూ.20 వేల లంచం తీసుకుంటుండగా అరెస్ట్ చేశారు. ఏసీబీ న్యాయస్థానం వెంకటేశ్వరరావుకు ఏడాది జైలుశిక్షతో పాటు రూ.20 వేల జరిమానా విధిస్తూ తీర్పును వెలువరించింది.

రూ. 200 కోట్ల మద్యం సరఫరాకు బ్రేక్

● సాంకేతిక సమస్యతో ఇబ్బందులు.. పరిష్కరించిన అధికారులు

హైదరాబాద్ సిటీ, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): సర్వర్‌లో తలెత్తిన సాంకేతిక సమస్య వల్ల మంగళ, బుధవారాల్లో మద్యం డిపోల నుంచి వైన్ షాపులకు వెళ్లాల్సిన మద్యం సరఫరా నిలిచిపోయింది. దాంతో రోజుకు రూ.100కోట్ల చొప్పున.. రెండు వందల కోట్ల రూపాయల విలువైన మద్యం సరఫరాకు బ్రేక్ పడింది. ఎక్సైజ్ అధికారులు వెంటనే స్పందించి టెక్నికల్ టీమ్ సహకారంతో సమస్యను పరిష్కరించడంతో గురువారం తెల్లవారుజామున డిపోల నుంచి యథావిధిగా లిక్కర్ సరఫరా జరిగినట్లు అధికారులు తెలిపారు.

రెండు రోజులు.. 45%

(5వ పేజీ తరువాయి)



వివరాలు అందజేస్తున్న కలెక్టర్ అనుదీప్

ఇంటింటికి స్టిక్కర్లు అంటించే ప్రక్రియ 45 శాతం పూర్తయ్యిందని, రెండు రోజుల్లో 13,35,673 ఇళ్లకు స్టిక్కర్ అంటించినట్లు బల్దియా గురువారం ఒక ప్రకటనలో తెలిపింది. సర్వేలో భాగంగా ఇంటింటికి వెళ్తున్న ఎన్యూమరేటర్లు యజమాని పేరు, మొబైల్ నంబర్ తీసుకొని స్టిక్కర్ అంటించి, 3-4 రోజుల్లో వచ్చి సర్వేకు సంబంధించిన ఫారం ప్రకారం పూర్తి వివరాలు సేకరిస్తామని చెబుతున్నారు. కొన్ని కుటుంబాల్లో భార్యాభర్తలు ఉద్యోగం చేస్తున్న నేపథ్యంలో వారికి ముందస్తు సమాచారమిచ్చేందుకు మొబైల్ నెంబర్ తీసుకుంటున్నామని ఓ అధికారి తెలిపారు. కాగా, స్టిక్కర్లు అంటించే ప్రక్రియ కొన్ని సర్కిళ్లలో నేడు ముగిసే అవకాశం లేదు. స్టిక్కరింగ్ పూర్తయిన చోట నేడు సర్వే మొదలవుతుందని, ఇతర ప్రాంతాల్లో రేపటి నుంచి సమాచార సేకరణ జరుగుతుందని ఓ అధికారి తెలిపారు. సర్వేలో భాగంగా 56 ప్రధాన, 19 అనుబంధ అంశాలకు సంబంధించిన పూర్తి వివరాలు తీసుకోనున్నారు.

ఇంటింటి సర్వేలో కుటుంబ వివరాలు ఇచ్చిన కలెక్టర్

హైదరాబాద్ సిటీ, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): సమగ్ర కుటుంబ ఇంటింటి సర్వేలో భాగంగా హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి గురువారం తన ఇంటికి వచ్చిన ఎన్యూమరేటర్లకు వివరాలు అందజేశారు. ఈ సందర్భంగా బంజారాహిల్స్‌లో కలెక్టర్, ఆయన కుటుంబసభ్యుల వివరాలు నమోదు చేసిన ఎన్యూమరేటర్లు ఇంటికి సర్వే స్టిక్కర్ అంటించారు.